# సింగిల్ పేజీ కథలు

## మా ఇంటికి పోతా!

రాగేశ్వరీదేవికి హృదయం రగిలిపోతున్నది. కోట్ల ఆస్తి ఉంది. ఎదుటివారిని కట్టిపడేసే అందమూ ఉంది. ఒక్కగానొక్క కూతురు ఊటీలో చదువుతున్నది. ఉన్న వ్యాపారాలు చాలక కొత్త వ్యాపారాల గురించి ఆలోచిస్తూ ఇరవై నాలుగ్గంటలూ బిజీగా ఉండే భర్త అఖిలేష్‌కు బ్రహ్మాండమైన పేరు ప్రఖ్యాతులున్నాయి. ఇన్ని ఉన్నా రాగేశ్వరీదేవి రగిలిపోవడానికి పెద్ద కారణం అంటూ లేదు. చిన్న విషయమే. అదీ ఫాల్స్ ప్రిస్టేజ్.

మహిళామండలిలో ఆ రోజు ఉదయం ఓ చిన్న కార్యక్రమం జరిగింది. తన ప్రత్యర్థి డాక్టర్ సురేఖ ఓ ఇద్దరు అనాథ పిల్లల్ని క్లబ్బు సమావేశానికి తీసుకు వచ్చి, గత రెండు సంవత్సరాల నుండీ ఆ నిరుపేద పిల్లల్ని తాను చదివిస్తున్నట్లుగా ప్రకటించి ఆరోజు క్లబ్బు కార్యక్రమంలో భాగంగా ఆ పిల్లలకు బట్టలు బహూకరించింది. ఆ పిల్లలిద్దరూ డాక్టర్ సురేఖను ఓ దేవతలా చూస్తూ పాదాలకు నమస్కరించారు.

మహిళామండలి గౌరవ సభ్యురాళ్లందరూ ఒకరిమీద ఒకరు పోటీ పడుతూ డాక్టర్ సురేఖను పొగడ్తలతో ఆకాశానికి ఎత్తేశారు. అప్పుడు హుందాగా, గర్వంగా ఆమె రాగేశ్వరీదేవి వైపు చూసిన చూపు హృదయాన్ని రగిలించి వేసింది.

రాగేశ్వరి ఆలోచిస్తూ కారు డ్రైవ్ చేస్తున్నది. 'తానూ ఏదో ఒకటి చెయ్యాలి. లేకపోతే క్లబ్బులో తనని సపోర్టు చేసే మెంబర్స్ దృష్టిలో కూడా తాను చులకనైపోతుంది. ఛ... అంతకంటే అవమానకరమైన విషయం మరొకటి లేదు. రాగేశ్వరి కారు గాంధీ పార్కు దగ్గర ఆగిపోయింది.

అందుక్కారణం పార్కు గేటు ముందు నిలుచుని వచ్చీపోయేవాళ్లకు వేరుశెనగకాయలు అమ్ముతున్న పన్నెండేళ్ల పిల్ల ఆమె దృష్టిని ఆకర్షించింది. రాగేశ్వరి చకచకా ఆ పిల్ల దగ్గరికెళ్లి బేరం పెట్టింది. వేరుశెనగకాయల్ని కాదు, పిల్ల జీవితాన్ని. పిల్ల తన ముసలి తండ్రికి చెప్పాలంది. వెంటనే ఆ పిల్లను తీసుకుని గుడిసెలో కూర్చుని గంజాయి తాగుతున్న ముసలి తండ్రిని ఒప్పించి ఐదు వేల రూపాయలకు పిల్లను కొనుక్కుంది.

ఆ పిల్లకు తానుగా 'గంగ' అని పేరు పెట్టింది. మంచి బట్టలు కొన్నది. మంచి భోజనం పెట్టించింది. పనిపిల్ల గంగకు అంతా కలలో జరుగుతున్నట్లనిపించింది. అంతా బాగానే ఉంది కానీ రాగేశ్వరీదేవి తన స్నేహితురాళ్లు ఇంటికి వచ్చినప్పుడు, తానా పిల్లను పెంచి చదివించి గొప్పదాన్ని చేస్తానని ప్రకటిస్తుంది. ఆ తర్వాత గంగను అందరి ముందు, తననో మదర్ థెరిస్సాగా, మేధాపాట్కర్‌గా, కరుణామయిగా.. ఇంకా ఇంకా పొగడాలని శిక్షణనిస్తోంది. మొదట్లో గంగ రాగేశ్వరీదేవి చెప్పినట్లే పాఠాలు వల్లెవేసేది.



రాను రాను అదో మొక్కుబడి కార్యక్రమం అయిపోయింది. పైగా గంగతో ఇంట్లో చిన్న చిన్న పనులు కూడా చేయించుకుంటున్నది. క్లబ్బులో రాగేశ్వరి 'గంగ' విషయంలో చేస్తున్న సహాయం వల్ల ఆమె పలుకుబడి నాలుగురెట్లు పెరిగిపోయింది. తోటి సభ్యురాళ్లు అభినందనలతో ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. రాబోయే మహిళామండలి ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా తప్పకుండా గెలిచి తీరుతుందని హామీ ఇస్తున్నారు.

రాగేశ్వరీదేవిలో ఈగో తృప్తి పడింది. ఓ సమాజం వారు రాగేశ్వరీదేవికి 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు కూడా ప్రకటించి ప్రధానోత్సవ సభ గ్రాండ్‌గా ఏర్పాటు చేశారు.

గంగ పరిస్థితి పూర్తిగా దిగజారింది. తన లక్ష్యం నెరవేరటంతో రాగేశ్వరీదేవి ఆ పిల్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గత రెండు రోజులుగా జ్వరం. పట్టించుకున్న వారే లేరు. గుడిసెలో అయ్యను చూడాలనిపిస్తోంది. స్వేచ్ఛగా హాయిగా ఉండే జీవితం ఒక్కసారిగా ఊబిలో దిగబడిపోయినట్లనిపిస్తున్నది.

రాగేశ్వరీదేవికి 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు సభకు ఊరిలోని ప్రముఖులందరూ వచ్చారు. ఎం.పీ.గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నది రాగేశ్వరీదేవి. ఆ తర్వాత రాగేశ్వరీదేవి పెంచుకుంటున్న అనాథ బాలికను స్టేజి మీదకు తీసుకువచ్చి మాట్లాడమన్నారు. గంగకు ఆ మాటల మీద విరక్తి కలిగింది.

"నాకు ఆనందం లేదు. స్వేచ్ఛ లేదు. ఈవిడ చేసిన సహాయం నాకు అక్కరలేదు. ఇలా ఎల్లకాలం నేను పొగడలేను. నేను మా ఇంటికి పోతా.. మా అయ్యను చూడాలి.. నేను హాయిగా పల్లీలమ్ముకొని బతుకుతా.. మీ అందరికీ దండం..." అని చెప్పి స్టేజి దూకి పరుగుపెట్టింది.

రాగేశ్వరీదేవి ఊహించని ఈ పరిణామానికి కళ్లు తిరిగి పడిపోయింది. ప్రముఖులతో పాటు అందరూ పగలబడి నవ్వుతుండగా, ఆ సభ రసాభాస అయింది.

**-పి.వి.రమణకుమార్**
(చిలకలూరిపేట)

## వ్యక్తిత్వం

అవినాష్ అంటే ఎందుకో నాకు సదభిప్రాయం లేదు. అలాగని అతడి వలన నాకు మంచిగానీ, చెడుగానీ ఏదీ జరగలేదు. మరి అతడంటే నాకెందుకు అలాంటి అభిప్రాయం కలిగిందో నాకే తెలియదు.

రాహుల్ నాకు చిన్ననాటి స్నేహితులు. ఈమధ్యనే అతడికి ఓ పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అదే కంపెనీలో అవినాష్ చాలా కాలంగా పనిచేస్తున్నాడు. వారిద్దరి మధ్యా స్నేహం ఏర్పడింది. రాహుల్ ద్వారానే నాకు అవినాష్ ఫ్రెండ్ అయ్యాడు. బహుశా అవినాష్ కలిశాక రాహుల్ నాతో తక్కువగా కలవటం వలననే అతడంటే నాకు వ్యతిరేకభావం ఏర్పడిందనుకుంటా.

అవినాష్‌తో స్నేహం ఏర్పడ్డాక రాహుల్ నాతో తక్కువగా కలుస్తూ, ఆ తక్కువ సమయంలో కూడా కొత్త మిత్రుడి గురించిన కబుర్లే చెప్పేవాడు. "నీకు తెలుసా? అవినాష్ వాకింగ్ ఎన్‌సైక్లోపీడియా లాంటివాడు. మనకు ఏ డౌట్ వచ్చినా అతడు తప్పకుండా క్లారిఫై చేయగలడు... శంకర్!... ఏదేమైనా అలాంటివాడు మన ఫ్రెండ్ కావటం అదృష్టంరా..."

ఇలాంటి మాటలు వింటుంటే, నాకు చాలా ఇబ్బందిగా అనిపించేది. అవినాష్ మీద క్రమంగా నాలో ద్వేషం పెరగటమూ నాకే అర్థమవుతోంది.

అలాంటి పరిస్థితిలో ఒకరోజు రాహుల్‌ని కలిసి కాసేపు కబుర్లు చెప్పుకున్నాక, ఇంటికి తిరిగొస్తూ ఉన్నాను. రోడ్ క్రాస్ చేస్తుంటే వేగంగా వస్తున్న మోటార్